క్లుప్తంగా

సీతారామాలయంలో ప్రత్యేక పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: అయోధ్య శ్రీరామమందిరంలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ట ఉత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని కోదండ సీతారామాలయంలో ఆదివారం హోమాలు నిర్వహించారు. ముందుగా సీతారాములకు ఆలయ ప్రధాన అర్చకుడు వజ్జల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం నిర్వహించిన పూజల్లో కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు అయిత ఎర్రయ్య, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట గోవింద్, అయిత అప్పలరాజు, బొట్ట కృష్ణ, రెడ్నం హరికుమార్, అచ్చారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉచితంగా గ్రూప్-2 మెటీరియల్



గ్రూప్ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న గిరి జాగృతి ప్రతినిధులు

పెందుర్తి: గిరిజన యువతకు గ్రూప్-2 మెటీరియల్ ఉచితంగా అందించనున్నట్లు గిరి జాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు మోరి సింహాచలం వెల్లడించారు. పెందుర్తిలోని అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా రూపొందించిన గ్రూప్-2 మెటీరియల్‌ను కొయ్యూరు డీటీ దుమంతి సత్యనారాయణ, అడ్వకేట్ వి.మోహనరావు, మోరి సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ దాదాపు 200 మంది యువతీ యువకులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాకూరు చినసింహాచలం, కోరటం ఈశ్వరరావు, సాయి మోరియా, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులివ్వాలి

విశాఖ విద్య: ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లలితకుమార్, కోశాధికారి ఎన్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ శోభాయాత్ర



శోభాయాత్ర చేస్తున్న మోదీ వీధి సంక్షేమ సంఘం ప్రతినిధులు, నివాసితులు

సింహాచలం: అయోధ్యలోని రామజన్మభూమి ఆలయంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఆదివారం 98వ వార్డు పరిధి మోదీ వీధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ శోభా యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి గోశాల వరకు సంఘం ప్రతినిధులు, నివాసితులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. రామ జన్మభూమిలో పెద్ద ఎత్తున భవ్య రామమందిరం నిర్మాణం ఎంతో గర్వకారణమన్నారు.

30 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: ఫార్మాసిటీ సింహాద్రి కూడలిలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం పోలీసులు దాడులు జరిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న జి.రామారావు అనే వ్యక్తి నుంచి (180ఎంఎల్) 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.తేజేశ్వరరావు చెప్పారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: అందరు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. దలాయిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ 'నేను సిద్ధం.. మీరు సిద్ధమా' అంటూ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన కోసం జగనన్న ప్రభుత్వం రూ.495 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు శక్తి వంచన లేకుండా పని చేయాలని సూచించారు. అదే విధంగా చిన్న చిన్న మనస్పర్థలను విడనాడి పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కన్వీనర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

ఆసరా లబ్ధిదారుల హర్షాతిరేకాలు



లబ్ధిదారులతో కలిసి థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పక్షపాతి అని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని గవరపాలెం, లక్ష్మీపురం, పొర్లుపాలెం, వరలక్ష్మీనగర్, వేపగుంట ఎస్సీబీసీ కాలనీల లబ్ధిదారులతో కలిసి ఆదివారం వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 131 డ్వాక్రా గ్రూపులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.93,66,624 లబ్ధి చేకూరనుందన్నారు. మొత్తం నాలుగు విడతల్లో ఆయా గ్రూప్‌లకు రూ.3,74,66,412 నగదు జమైందన్నారు. ప్రజలపై నిజమైన ప్రేమ కలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు ఏం కావాలో.. వారికి ఎం చేయాలో నిరంతరం ఆలోచించేది సీఎం వైఎస్ జగన్ ఒక్కరే అని... ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 'థ్యాంక్యూ సీఎం సర్..జై జగన్' అంటూ లబ్ధిదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీవో కనకరత్నం, పార్టీ నాయకులు రాపర్తి మాధవరావు, పెదగాడి చిన్నారావు, కుంచా భార్గవ్, పులమరశెట్టి లక్ష్మణ్, కాళ్ల సురేష్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ వల్లే పంచగ్రామాల భూసమస్య

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వచ్చిందన్న విషయాన్ని టీడీపీ నేత పాశర్ల ప్రసాద్ తెలుసుకోవాలని వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం అన్నారు. అడవివరంలో ఆయన ఆదివారం మాట్లాడారు. 1996లో పంచగ్రామాల భూసమస్యను సృష్టించినది టీడీపీ ప్రభుత్వమే అన్నారు. అప్పటి వరకు ఎంతో హాయిగా ఉన్న రైతులు, ప్రజలను కష్టాల్లోకి నెట్టేసిన ముఖ్యమంత్రి చంద్రబాబే అని మండిపడ్డారు. పాశర్లకు దమ్ముంటే దేవస్థానం చైర్మన్‌తో సమస్యపై తీర్మానం చేయించాలని సూచించారు. బీఆర్‌టీఎస్ బాధితులకు అన్ని విధాలా వైఎస్సార్‌సీపీ న్యాయం చేస్తోందన్నారు. భూసమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు.

తొలిపావంచా పరిసరాలు శుభ్రం



స్వచ్ఛతీర్థ నిర్వహిస్తున్న శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ తొలిపావంచా వద్ద ఆదివారం స్వచ్ఛతీర్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 21వరకు ఆలయాల శుభ్రత కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా తొలిపావంచా ప్రాంగణంలోని చెత్తాచెదారాలను తొలగించారు. నీటితో పరిసరాలను శుభ్రం చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన భారత్ మోదీ లక్ష్యం



హెల్త్ కార్డులు అందజేస్తున్న రామునాయుడు

సబ్బవరం: అభివృద్ధి చెందిన భారత్ ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు అన్నారు.మండలంలోని మొగలిపురంలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత సంకల్పయాత్రలో ఆయన ప్రసంగించారు. ప్రతి కుటుంబం వ్యక్తిగతంగా అభివృద్ధి చెందినప్పుడే యావత్ దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి సన్యాసిరావు, మండల బీజేపీ అధ్యక్షుడు గొంప నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

అలవోకగా 150 పద్యాల ఆలాపన



డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదవి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదవి వినిపించారు.

సమకాలిన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరధి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెదవీర్రాజు చదవి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

నేడు సింహగిరిపై సీతారాముల శాంతి కల్యాణం

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న పురాతన సీతారామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కల్యాణంతో పాటు ఇతర పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈవో కోరారు.

నలుగురు పందెం రాయుళ్ల అరెస్ట్

పరవాడ: ఈ.మర్రిపాలెంలో కోడి పందాల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు జరిపి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ జి.తేజేశ్వరరావు సిబ్బందితో దాడులు జరిపి కోడి పందాలు ఆడుతున్న 4 గురు వ్యక్తులతో పాటు రూ.2 వేలు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళాలు



శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ఆదివారం భారీగా విరాళాలు అందజేశారు. పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ రూ. .1,66,666, ప్రముఖ న్యాయవాది బేతిన శ్రీనివాస్ రూ.1,11,051, వ్యాపారస్తులు ఈర్లి చిన్నారావు రూ.1,66,660, మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య రూ. 25,116 ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు గెడ్డం కృష్ణ,బి. నాని, ప్రకాష్, బర్ల రమణ, కోరాడ శ్రీను , చింతల శ్రీను, ఉసిరికల రమేష్ తదితరులు విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులకు కుమారుల అప్పగింత



రామసాయిని తండ్రి వేణుగోపాలరావుకి అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు



అవినాష్‌కుమార్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: మతిస్థిమితం లేకుండా నగరానికి వచ్చిన ఇద్దరిని ఆర్పీఎఫ్ పోలీసులు రెస్క్యూ చేసి జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బందికి అప్పగించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన ఏయూటీడీ సిబ్బంది తల్లిదండ్రులను పిలిచి పిల్లలను అప్పగించారు.

వివరాలిలా..

- జార్ఖండ్ రాష్ట్రం, రాంచీకి చెందిన అవినాష్‌కుమార్ సోను అనే వ్యక్తికి రియల్ ఎస్టేట్‌లో నష్టం రావడంతో మానసిక పరిస్థితి క్షీణించింది. ఈ నెల 19న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రాంచీ రైల్వే స్టేషన్‌లో ట్రైన్ ఎక్కేశాడు. అతడి బంధువులు చూసి వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో విశాఖపట్నం ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందజేశారు. విశాఖ ఆర్పీఫ్ పోలీసులు అతడిని గుర్తించి ట్రైన్ నుంచి దింపేసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందజేశారు. భీమ్‌నగర్ ఏయూటీడీ సిబ్బంది అతడిని షెల్టర్‌కు తరలించారు. అవినాష్‌కుమార్ తండ్రి మనోజ్ సోను, తల్లి సరోజినీ దేవిలను ఏయూటీడీ షెల్టర్‌కు పిలిపించి కొడుకు సోణ/ను అప్పగించారు. ఈ సందర్భంగా వారు ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.
- విజయనగరం జిల్లాకు చెందిన రామసాయి అనే బాలుడు మతిస్థిమితం లేక ఇంట్లో నుంచి బయటకు వచ్చేసి విశాఖ రైల్వే స్టేషన్‌లో తిరుగాడుతున్నాడు. అతడిని ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బందికి తెలియజేశారు. టీఎస్సార్ కాంప్లెక్స్ నిరాశ్రయ వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు. బాలుడి తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్ తెలుసుకుని వారికి సమాచారం అందజేశారు. బాలుడు తండ్రి వేణుగోపాలరావు ఆదివారం షెల్టర్‌కు రావటంతో రామసాయిని అప్పగించారు.

నేడు సిద్ధేశ్వరానంద మహాస్వామి అవతరణోత్సవం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి జగద్గురు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 88వ అవతరణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు గురువందన సమర్పణ జరుగుతుందన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సీతారాముల పట్టాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గీతాభవనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక పూజలు చేస్తున్న సంస్థ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: అయోధ్యలో సోమవారం నిర్వహించనున్న బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ వన్ టౌన్ రాజప్పనాయుడు వీధిలోని గీతాభవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు సారథ్యంలో వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు వేదపఠనం చేయగా గీతా ప్రచార సమితి సభ్యులు సామూహికంగా భగవద్గీత శ్లోకాల పారాయణ, శ్రీవిష్ణు సహస్రనామం, శ్రీరామ గాయత్రి, శ్రీరామ రక్షా స్తోత్రం, శ్రీరామనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. విశ్వరూప సహిత శ్రీకృష్ణ పరమాత్ముడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి అవతరించిన అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట జరగడం దేశానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, కనకవల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక

48 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



బంగారమ్మపాలెం సమీపంలో కలుసుకున్న సబ్బవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది.1976 – 77 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బంగారమ్మపాలెం సమీపంలో సమావేశం అయ్యారు.

ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిలో స్థిరపడి, ఉద్యోగాలు చేసి రిటైర్మెంట్ అయి పిల్లా పాపలతో గడుపుతున్న వారంతా 48 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అల్లరి,చిలిపి చేష్టలు స్మరించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతి ఏడాది సబ్బవరంలో కలుసుకునేందుకు వీలుగా ఒక భవనం నిర్మించాలని.. చదువుకున్న హైస్కూల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించి, పాఠశాలకు శాశ్వత అవసరాలు తీర్చాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నాగిరెడ్డి వెంకటరమణ, ఎస్. రామునాయుడు, గొర్లి సత్యనారాయణ, బోకం ముత్యాలనాయుడు, బి. నర్సింహమూర్తి, నూకలక్ష్మి, కోటేశ్వరరావు, వెంకటరత్నం, బోకం పైడితల్లి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. అర్చకుడు రఘునాథ్, గిరి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు.

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న చంద్రశేఖర్

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి సబ్బవరంలోని గోపాల్‌నగర్‌కు చెందిన రోమాల చంద్ర శేఖర్ రూ .90 వేలు విరాళం అందించారు. తన నివాసంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం ఉదయం అందజేశారు. ఆలయ గర్భగుడికి గ్రానైట్ ఏర్పాటుతో పాటు కలశ స్థాపనకోసం విరాళం అందించినట్లు సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ వెంట ఉప సర్పంచ్ దుంగ ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పిల్లల ముసలయ్య, నక్కెళ్ల అచ్చిబాబు, ఇసరపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామి ఆలయం వద్ద క్యూలైన్ల ఏర్పాటు



క్యూలైన్లను పరిశీలిస్తున్న ట్రస్టీలు, ఏఈ

సింహాచలం: భైరవస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో దేవస్థానం అధికారులు పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఉచిత దర్శన క్యూలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రాంగణాన్ని చదును చేసి అందులో దర్శన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో షెడ్ నిర్మాణం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. అలాగే స్వామికి అభిషేకం నిర్వహించిన తర్వాత నీరు బయటకు వెళ్లేందుకు ప్రత్యేకంగా డ్రైనేజీ నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, ఏఈ హరి ఆదివారం సంబంధిత ఏర్పాట్లు పరిశీలించారు.